సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఐక్యతతోనే హక్కుల సాధన



సమావేశంలో పాల్గొన్న శిష్టకరణాల అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యపడుతుందని కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు అన్నారు. శిష్టకరణాల అసోసియేషన్ కూర్మన్నపాలెం శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిష్టకరణాలు ఐక్యంగా మెలగాలని కోరారు. శిష్టకరణాల కల ఓబీసీ అని, ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు కృషి చేస్తున్నారని అన్నారు. వారికి సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంగవరం గోపీ, ప్రతినిధులు గర్భం నాగేశ్వరరావు, డబ్బీరు గురునాధరావు, బీవీఎం కృష్ణ, సీహెచ్ రామకృష్ణ, కేఎస్ఆర్ పట్నాయక్, జీవీఆర్ మాళి, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి దివాకర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి దివాకర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ ఉద్యోగి దుగ్గివలస దివాకర్‌కు డాక్టరేట్ లభించింది. దివాకర్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన బెంగళూరు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. బెంగళూరు యూనివర్సిటీలో సోమవారం జరిగిన కాన్వొకేషన్‌లో వర్సిటీ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు.

దేవాలయాల పరిరక్షణకు సంతకాల సేకరణ

గాజువాక : హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం గాజువాక బీజేపీ నాయకులు సోమవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి ఆధ్వర్యంలో వుడా కాలనీలోని శివాలయం వద్ద భక్తుల సంతకాలను సేకరించారు. ప్లకార్డులను ప్రదర్శించారు. నర్సింగరావు మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ చేపడుతున్న ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నాయకులు గూటూరు శంకరరావు, టేకేటి పెంటయ్య, బొండా ఎల్లాజీరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు ప్రభాకర్

కూర్మన్నపాలెం: వడ్లపూడి బ్రిడ్జి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీస్ స్టేషన్ సీఐ తెలిపిన వివరాలివి.. పెందుర్తిలోని చీమలాపల్లి గ్రామానికి చెందిన ఎం.ప్రభాకర్(50), చింతల అగ్రహారం గ్రామానికి చెందిన పాలమరశెట్టి సురేష్ సోమవారం ద్విచక్రవాహనంపై అనకాపల్లి నుంచి గాజువాక పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పని చూసుకుని సాయంత్రం సమయంలో తిరిగి వెళ్తూ మద్యం సేవించిన వీరు వడ్లపూడి బ్రిడ్జి దగ్గర ఓ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. దీంతో ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న ప్రభాకర్ ముందుకు తూలిపడడంతో, తలకు బలమైన గాయమైంది. దగ్గరలోని అగనంపూడి ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ప్రభాకర్ మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణలు

- రహదారికి ఇరువైపులా దుకాణాల ఏర్పాటు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- స్థానికుల అవస్థలు



వడ్లపూడిలోని సచివాలయాన్ని ఆనుకుని కొత్తగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలు



వడ్లపూడి రహదారిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారిలో ఆక్రమణలతో పాదచారులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాదచారులు నడిచేందుకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో రద్దీ సమయంలో ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

జీవీఎంసీ స్థలం ఆక్రమణ

వడ్లపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం రోడ్డులో జీవీఎంసీ స్థలాన్ని ఆక్రమించి చిరు వ్యాపారులు జ్యూస్ సెంటర్లు, పాన్ దుకాణాలు, ఐస్‌క్రీం, కూరగాయలు, పళ్ల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వాహనాలు పార్క్ చేసే వీలు లేకపోతోంది. మరి కొందరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చి వేల రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో రహదారులు ఇరుకుగా మారి పాదచారులకు ఇబ్బంది తప్పడంలేదు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు, జన సంచారానికి ఇబ్బందికరంగా ఉన్నా జీవీఎంసీ సిబ్బంది ఈ దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పెరిగిన జనాభా, ఇతర అవసరాలకు అనుగుణంగా రహదారి విస్తరణ చేయాల్సి ఉన్నా అక్రమ దుకాణాల వల్ల అది సాధ్యపడడంలేదు. నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్న ఈ ప్రాంతంలో వాహనదారులు వాహనాలను నిలపలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికే పరిస్థితి దారుణంగా ఉండగా.. మరికొద్ది రోజుల్లో మరో మూడు, నాలుగు దుకాణాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కొంతమంది దుకాణదారులు, స్థానికంగా పలుకుబడి ఉన్న నాయకుల అండదండలతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తమ దుకాణాలను తొలగించకుండా సంబంధిత శాఖ అధికారులకు డబ్బులు ముట్టజెప్పి, కొలతలు తక్కువ చేసి దుకాణాలను వదిలేశారనే ఆరోపణలున్నాయి. ఇవి కాక ఇంటి నిర్మాణం కోసం వినియోగించే ఇసుక, ఇటుక, పిక్క తదితర భవన నిర్మాణ సామగ్రిని సైతం రోడ్డుపై వేయడం వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పాటు చేసిన బడ్డీలు

చర్యలు చేపట్టాలి

రహదారులను ఆక్రమించి దుకాణాలు, బడ్డీలు ఏర్పాటు చేసుకుని అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాగే వదిలేస్తే మరింతమంది యథేచ్ఛగా ఆక్రమణకు పాల్పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను, కార్పొరేషన్ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం

వడ్లపూడి రోడ్డులో రెండువైపులా దుకాణాలు పెట్టేశారు. ఆ దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కు చేయడంతో మరింత ఇబ్బందిగా ఉంటోంది. పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్లే సమయంలో ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బండారు సందీప్, వడ్లపూడి

సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

వడ్లపూడి ప్రాంతంలో రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. త్వరలోనే పనులు చేపట్టనున్నాం. రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను కూడా తొలగిస్తాం. గతంలో దుకాణాలను తొలగించాం, కానీ మళ్లీ అదేస్థానంలో ఏర్పాటు చేసేస్తున్నారు. వ్యాపారుల్లో అవగాహన కలిగించి, దుకాణాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

– పొందూరు సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ



928వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 928వ రోజు వైజాగ్ నేషనల్ ఏజిటేషన్ కమిటీ సభ్యులు పాల్గొని, దీక్షకు సంఘీభావం తెలిపారు. కమిటీ సెక్రటరీ ఎ.వి.ఎన్.ఎం అప్పారావు మాట్లాడుతూ కార్మికులకు తక్షణం మినిమమ్ పెన్షన్ 7500 రూపాయలు డీఏతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిటీ ప్రెసిడెంట్ మాట్లాడుతూ అన్ని యూనియన్లు పెన్షన్ల గురించి గట్టిగా పోరాడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాగానే మినిమమ్ పెన్షన్ ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణను ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'గిడుగు' సేవలు చిరస్మరణీయం



గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హైస్కూల్ సిబ్బంది

అగనంపూడి: తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులును తెలుగు జాతి ఎప్పటికీ మరచిపోదని అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు అన్నారు. మాతృభాషా వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాష, సాహిత్యంపై ఐదు రోజులుగా పలు పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృష్టి పాఠశాలకు స్కిల్ భారత్ సమ్మాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పాఠశాల ఈడీ డాక్టర్ మేఘన

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-9లోని సృష్టి వరల్డ్ పాఠశాలకు ప్రతిష్టాత్మక స్కిల్ భారత్ సమ్మాన్ - 2023 అవార్డు లభించింది. విద్యార్థుల్లో విద్యతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్, క్రియేటివ్ స్కిల్స్, సహకార నైపుణ్యం అభివృద్ధి చేసే పాఠశాలలకు సీఎస్‌బీఎస్ టీవి ఆధ్వర్యంలో ఏటా ఈ అవార్డులు అందజేస్తుంటారు. ఈ ఏడాది 4 దేశాలకు చెందిన సుమారు 1000 పాఠశాలల నుంచి నామినేషన్లు అందాయి. అందులో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చే పాఠశాలల్లో విశాఖ జిల్లా నుంచి సృష్టి వరల్డ్ పాఠశాల ఒక్కటే ఎంపిక కావడం విశేషం. సీఎస్‌బీఎస్ టీవీ ఆధ్వర్యంలో ముంబైలోని నెహ్రూ సెంటర్లో సోమవారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘన కంభంపాటికి అవార్డును ప్రదానం చేశారు.

గంగవరం స్కూల్లో ఈవెనింగ్ ఎడ్యుకేషన్ సెంటర్



ఈవెనింగ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో పాల్గొన్న ఎంపీపీ స్కూల్ విద్యార్థినులు

పెదగంట్యాడ: గంగవరం గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఆదానీ గంగవరం పోర్ట్ సీఎస్ఆర్ నిధులతో ఆదానీ ఈవెనింగ్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ యాజమాన్యం మాట్లాడుతూ పేదపిల్లలకు విద్యను అందించడం ద్వారా సమాజ ప్రగతి సాధ్యపడుతుందనే లక్ష్యంతో కంప్యూటర్ సెంటర్ ప్రారంభించామన్నారు. గంగవరం పోర్ట్ లిమిటెడ్ కూడా భవిష్యత్తులో నైపుణ్యాభివృద్ధి మరియు మౌలిక సదుపాయాలను కల్పించి ప్రజలతో మమేకం కావాలని యోచిస్తోందన్నారు.

డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజనీరింగ్-మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్-డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లమాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు అవగాహన సదస్సు

కంచరపాలెం : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు తయారీ, సేవా పరమైన యూనిట్లు ఏర్పాటుపై అవగాహన సద``స్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఐటీఐఎటీ కార్యాలయంలో మంగళవారం ఉద యం 10 గంటలకు అవగాహన సదస్సు ఉందన్నారు. ఆసక్తి గల అర్హత అభ్యర్థులు kvic onine.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకొని సదస్సు రావాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతోపాటే నైట్ అలవెన్స్‌లు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకులు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, రాష్ట్ర మెయింటినెన్స్ కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శి కే శ్రీనివాసరావు, డీఎస్ఎన్ మూర్తి, జోనల్ నాయకులు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత



బస్సు దిగి జీవీఎంసీకి నడిచి వస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయినందున, వాటి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

అండర్‌పాత్ వంతెన విస్తరణకు వినతి



ఎంపీ జీవీఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: తలారివానిపాలెం అండర్ పాత్ వంతెనను విస్తరించాలని, వీలుకాని పక్షంలో ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావును అగనంపూడికి చెందిన వివిధ పార్టీల నాయకులు కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో ఎంపీ జీవీఎల్‌ని ఆయన నివాసం వద్ద కలిసి వినతిపత్రం సమర్పించారు. 85, 88 వార్డుల్లోని అగనంపూడి దువ్వాడ నిర్వాసిత కాలనీలు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలు, జీవీఎంసీ కాలనీలకు సమీప మార్గం ఉందని తెలిపారు. ప్రస్తుతం మూడు అడుగుల వెడల్పులో కేవలం పాదచారులు మాత్రమే వెళ్లేందుకు వీలుగా ఉన్న అండర్ పాత్ వంతెనను విస్తరించాలని కోరారు. జీవీఎంసీ పరిధిలోని అగనంపూడి టోల్‌గేటును తక్షణం తొలగించాలని, హోమీబాబా కేన్సర్‌ఆస్పత్రిలో అర్హులైన స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో దువ్వాడ రైల్వేస్టేషన్ ఎస్‌సీసీ సభ్యుడు కొలిపాక అప్పారావు, నాయకులు బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, చందు తదితరులున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పెదముషిడివాడ హైస్కూల్లో టగ్ ఆఫ్ వార్‌లో ఉత్సాహంగా పాల్గొన్న బాలికలు



అగనంపూడి హైస్కూల్లో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న బాలురు



గాజువాక హైస్కూల్లో పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

అగనంపూడి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా అగనంపూడి, లంకెలపాలెం, పినమడక, ఫార్మాసిటీ కాలనీ, పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, పరుగు పందెం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు.

గాజువాక హైస్కూల్లో..

గాజువాక : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్చర్ ఫౌండేషన్, ట్రెస్, రైస్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను రెండో రోజు సోమవారం బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. గాజువాక హైస్కూల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, నిర్వాహకులు పేర్ల అప్పారావు, సురేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం



అలీషా కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడకు చెందిన ఎస్‌కే అలీషా, పలికిలవాని పాలేనికి చెందిన గొందేశి సూరినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారికి వైఎస్సార్ బీమా సాయం మంజూరైంది. దీంతో ఆ కుటుంబాలకు తక్షణసాయంగా మంజూరైన చెరో రూ.10 వేలను అలీషా భార్య నూర్జహాన్‌కు, సూరినాయుడు భార్య వెంకటలక్ష్మికి కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి సోమవారం అందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీ

భెల్ ఎన్నికల బరిలో మూడు యూనియన్లు



భెల్ పరిపాలనా భవనం



జి.టి.పి.ప్రకాష్



ఉరుకూటి బాబూరావు



బొండా బాబూరావు



సుభాకర్ సాహు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 31న జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో మూడు యూనియన్లు తలపడుతున్నాయి. ఉదయించే సూర్యుడి గుర్తుతో సీరియల్ నంబర్ 2గా బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయీస్ యూనియన్, సింహం గుర్తుపై సీరియల్ నంబర్ 3తో యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) యూనియన్ పోటీ చేస్తున్నాయి. మూడో యూనియన్‌గా బీఎంఎస్ పిడికిలి, చక్రం, వరికంకి గుర్తుతో సీరియల్ నంబర్ 1తో పోటీలో నిలిచింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా అంగస్వామి ఉంటారని బీఎంఎస్ యూనియన్ వర్గాలు తెలిపాయి.

బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయీస్ నుంచి అధ్యక్షుడిగా సీఐటీయూ నుంచి జి.టి.పి.ప్రకాష్ , ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి బాబూరావు, గౌరవ అధ్యక్షుడిగా జి.సంజీవ రెడ్డి, చీఫ్ పేట్రన్లుగా దామోదర్ రెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు పోటీ చేస్తున్నారు. యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) నుంచి అధ్యక్షుడిగా బీహెచ్‌పీవీ ఎంఎస్ నుంచి బొండా బాబూరావు, టీఎన్‌టీయూసీ నుంచి సుభాకర్ సాహు, గౌరవ అధ్యక్షుడిగా మహాదేవన్, ఉప గౌరవ అధ్యక్షుడిగా బీఈఆర్‌పీటీయూ నుంచి కొల్లి దేముడు బరిలో నిలిచారు.

విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం

ఏయూ క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన వార్షిక బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలు, మార్పులను రాష్ట్ర యువతకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా పని చేస్తూ అన్ని కోర్సుల్లో ఐటీ సబ్జెక్టులను మిళితం చేయాలన్నారు. డేటా సైన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. ప్రోగ్రెసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతులకు దిశానిర్దేశం చేసారని గుర్తు చేశారు. అలాగే ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశపెట్టాలని సూచించారన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం దీంతో సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతి సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించేలా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు. పేటెంట్ల సాధన, నూతన ఉత్పత్తుల తయారీతో పాటు మరింత ప్రగతిని సాధించే దిశగా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్య భూమిక పోషించాల్సి ఉందన్నారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానం-2020లో సూచించిన విధంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచుతూ సిలబస్‌ను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.